క్లుప్తంగా

పార్‌పెల్లిలో డ్రై డే


నిల్వనీటిని పారబోయిస్తున్న సిబ్బంది

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లిలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యురాలు ప్రత్యూష ఆదేశాల మేరకు పార్‌పెల్లి ఆరోగ్య ఉపకేంద్రం సిబ్బంది గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ నిల్వనీటిని పారబోయించారు. నిల్వనీరు, అపరిశుభ్రతతో కలిగే నష్టాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శివకృష్ణ, ఆశవర్కర్లు రమ, గంగామణి, కళ, అంగన్‌వాడీ టీచర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఖానాపూర్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో అమూల్య ఐకేర్, లయన్స్‌క్లబ్ సంయుక్తంగా శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం మోతిబిందు కంటి సమస్యతో బాధపడుతున్న 17 మందిని ఆపరేషన్ కోసం ఆర్మూర్ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు నేత్రవైద్య సహాయ నిపుణులు వై.భీంరావు తెలిపారు. వెంకటస్వామి, సుదర్శన్, చందు, గంగాధర్, సందీప్, ఇర్ఫాన్, మంజుల ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నేతలు


మహేశ్వర్‌రెడ్డితో నాయకులు

నిర్మల్: నిర్మల్ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని పలువురు జిల్లానేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం వారిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. ఇందులో బీజేపీ నాయకులు జమాల్, దినేశ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి

ఖానాపూర్: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవిక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అమరణ నిరాహార దీక్ష చేసి శ్రీరాములు అసువులు బాశారని పలువురు పేర్కొన్నారు. అనంతరం వారి చిత్రపటానికి నివాళులర్పించారు. జితేందర్, కిషన్, లక్ష్మీనారాయణ, సతీశ్, మానస, ప్రవంతి, వరలక్ష్మి, తదితరులు ఉన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ


బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు


కడెం: మండలంలోని మైసంపేట్ గ్రామానికి చెందిన ఆడ మహేందర్ ఇటీవల ఎలుగుబంటి దాడిలో గాయపడి హైదరాబాద్‌లోని సరోజిని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

పాఠశాల తనిఖీ


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుదర్శన్

ముధోల్: మండలంలోని రాంటెక్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలను శుక్రవారం మండల ప్రత్యేకాధికారి సుదర్శన్ తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులు, గదులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి లబ్ధిదారుల వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో సురేశ్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా కాలువ పనులు


బాసరలో పూడిక తీయిస్తున్న సభ్యులు

భైంసా: బాసర రైతులకు యాసంగి పంటలకు లిఫ్ట్ ఇరిగేషన్‌తో సాగునీరు తరలించేందుకు కాలువ పూడిక పనులు చేయిస్తున్నారు. శుక్రవారం బాసర గోదావరి నది నుంచి పొలాల్లోకి వెళ్లే కాలువను ప్రొక్లెయినర్‌తో తవ్వించారు. వర్షాలతో కాలువ పూడుకుపోవడంతో అందులో ఉన్న మట్టిని తొలగించారు. లిఫ్ట్ ఇరిగేషన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పనులు చేయించారు. సతీశ్‌రావు, తదితరులు ఉన్నారు.

అసౌకర్యాల నడుమ చదివేదెలా?

- పాఠశాల భవనంలో ఖానాపూర్ గ్రంథాలయం
- కానరాని మరుగుదొడ్లు, తాగునీరు
- గోస పడుతున్న పాఠకులు, నిరుద్యోగులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


చదువుతున్న పాఠకులు



మూతబడిన పాఠశాల భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

ఖానాపూర్: పఠనాసక్తిని పెంపొందించి జ్ఞానం అందించేవి గ్రంథాలయాలు. కానీ నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ గ్రంథాలయంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాఠకులు, నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. సొంత భవనం లేక గత దశాబ్ది వరకు ఈ గ్రంథాలయం అద్దెభవనంలో కొనసాగింది. ఏడాదిగా పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని మూతబడిన ప్రభుత్వ పాఠశాల భవనంలో తాత్కాలికంగా గ్రంథాలయం నిర్వహిస్తున్నారు.

కానీ ఇక్కడి భవనంలో మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కరువయ్యాయి.

నాటి బస్టాండ్ నేటి గ్రంథాలయం..

పట్టణంలోని పాతబస్టాండ్ పక్కన ఖాళీగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనంలో ఏడాది కిందట గ్రంథాలయం ఏర్పాటు చేశారు. గతంలో శాంతినగర్ కాలనీలోని పాత పోస్టాఫీసు ఏరియాలో అద్దె భవనాల్లో ఉండే గ్రంథాలయానికి సొంత భవనం ఏర్పాటు కలగానే మిగిలింది. ప్రస్తుత పాఠశాల భవనం పరిసరాలు పురాతన భవనాల ఆవరణలో ఉండడంతో గ్రంథాలయానికి వెళ్లేందుకు మహిళలు, చిన్నారులు భయపడుతున్నారు.

1500 మంది సభ్యత్వం..

ఖానాపూర్‌లో గ్రంథాలయంలో ప్రస్తుతం 1500 మందికి పైగా పాఠకులు సభ్యత్వం కల్గి ఉన్నారు. రెగ్యులర్ పాఠకులతో పాటు రోజు 100 మందికి పైగా ఇతరులు వస్తుంటారు. రెండేళ్లుగా రెగ్యులర్ లైబ్రేరియన్ లేకపోవడంతో ఇన్‌చార్జి లైబ్రేరియన్, ప్రైవేటు స్వీపర్ విధులు నిర్వహిస్తున్నారు. పత్రికల కోసం ప్రతి నెలా రూ.3000 వరకు మాత్రమే నిధులు కేటాయిస్తున్నారు.

స్థలం కేటాయించక నిర్మాణంలో జాప్యం..

ఖానాపూర్‌లో గ్రంథాలయ భవనానికి ప్రభుత్వం స్థలం కేటాయిస్తే కోల్‌కత్తాకు చెందిన రాజారామ్ మోహన్‌రాయ్ సొసైటీ వారు రూ. 15 లక్షలతో భవనం నిర్మించి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఏటా గ్రంథాలయ వారోత్సవాల సమయంలో నేతలు సొంత భవన నిర్మాణానికి హామీలు ఇస్తున్నారు కాని కేటాయించడం లేదు.

డిజిటల్ గ్రంథాలయంగా మారిస్తే మేలు..

మారుతున్న కాలానికి అనుగుణంగా సొంత భవనం నిర్మించి డిజిటల్‌గా గ్రంథాలయంగా తీర్చిదిద్దాలి. దీంతో నిరుద్యోగులు, పాఠకులకు మరింత మేలు జరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సమస్య పరిష్కరించాలని పాఠకులు వేడుకుంటున్నారు.

భవనం కోసం స్థలం కావాలి



గత 50ఏళ్లుగా గ్రంథాలయానికి సొంత భవనం లేనిమాట వాస్తవమే. ప్రస్తుతం విద్యాశాఖకు చెందిన భవనంలో తాత్కాలికంగా గ్రంథాలయం నిర్వహిస్తున్నాం. మున్సిపాలిటీ పరిధిలో భవనానికి స్థలం కేటాయిస్తే కోల్‌కత్తాకు చెందిన రాజారాం మోహన్‌రాయ్ సంస్థ వారు రూ.15 లక్షలతో నిర్మించి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

– గొండాల పృథ్వీరాజ్, ఇన్‌చార్జి లైబ్రేరియన్

పాలకులు నిర్లక్ష్యం వీడాలి



విజ్ఞాన బండారాలుగా చెప్పే గ్రంథాలయాల్లో సౌకర్యాలు కల్పించడం లేదు. ఖనాపూర్ మున్సిపాలిటీ అయినా గ్రంథా లయానికి సొంతభవనం లేదు. ఇప్పటికైనా పాలకులు నిర్లక్ష్యం వీడి భవనానికి స్థలం కేటాయించాలి.

– గణేశ్, పాఠకుడు, ఖానాపూర్

మూత్రశాలలు లేవు



ప్రస్తుతం ఉన్న తాత్కాలిక భవనంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. తాగునీటితో పాటు ఫర్నిచర్ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని పట్టణంలో స్థలం కేటాయించి సమస్య పరిష్కరించాలి.

–గర్క లావణ్య, పాఠకురాలు, ఖానాపూర్

స్టడీచైర్లు, మెటీరియల్ తీసుకురావాలి



గ్రంథాలయంలో వెంటనే రెగ్యులర్ అధికారులను నియమించాలి. స్టడీచైర్లు, పోటీపరీక్షలకు ఉపయోగపడే మరిన్ని పుస్తకాలు తీసుకురావాలి. డిజిటల్ గ్రంథాలయంగా మారిస్తే యువకులకు మేలు జరుగుతుంది.

– దీపిక, పాఠకురాలు, ఖానాపూర్

నేడు ప్రజావేదిక

తానూరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 13వ విడత ఉపాధి హామీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో 2022–23లో చేపట్టిన ఉపాధి పనుల వివరాలను తనిఖీ బృందం సభ్యులు అధికారుల ముందు వెల్లడిస్తారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కూలీలు హాజరు కావాలని కోరారు.

వల్లభాయ్ పటేల్‌కు నివాళి

కుంటాల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో తొలి ఉపప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

రేపు విగ్రహ ప్రతిష్ఠాపన


గంగనీళ్లకు బయలుదేరిన గ్రామస్తులు

సోన్: మండలంలోని న్యూబొప్పారంలో మల్లన్న ఆలయంలో దేవుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఈనెల 17న నిర్వహించనున్నట్లు గ్రామంలోని యాదవ సంఘం సభ్యులు తెలిపారు. శుక్రవారం విగ్రహాలకు అభిషేకం నిర్వహించేందుకు యాదవులు, గ్రామస్తులు డప్పుచప్పుళ్ల నడుమ గంగనీళ్లకు బయలుదేరి వెళ్లారు. శనివారం వేదపండితులతో మహాయజ్ఞం, ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం అన్నదానం ఉంటుందని.. భక్తులు రావాలని కోరారు.

పాఠశాలల్లో విద్యార్థులకు గణిత పోటీలు


తానూరు పాఠశాలలో జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు


సోన్‌లో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు ఆరాధన

తానూరు: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం తానూరు జెడ్పీ పాఠశాలలో గణిత శాస్త్రంపై విద్యార్థులకు మండలస్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించారు. పోటీల్లో మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు మీడియంలో ప్రథమ స్థానంలో బి.రషిక (ఎల్వి పాఠశాల), ద్వితీయ స్థానంలో కృష్ణవేణి ఝరి(బి) పాఠశాల, తృతీయ స్థానంలో స్నేహ(బోరిగాం, పాఠశాల) నిలిచారు. ఇంగ్లిష్ మీడియంలో ప్రథమస్థానంలో లక్ష్మీకాంత్(భోసి), ద్వితీయ స్థానంలో అనిల్(భోసి), తృతీయ స్థానంలో లక్ష్మీప్రసన్న (భోసి) నిలిచారు. వీరు నిర్మల్‌లో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిబాబా తెలిపారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు నర్సయ్య, గంగాధర్, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి గంగుల చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

సోన్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం (టీఎంఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం మండలస్థాయి గణిత ప్రతిభా పోటీలు నిర్వహించారు. మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇంగ్లిష్ మీడియంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో సోన్ పాఠశాల విద్యార్థులు నరసింహ, ప్రసూన శ్రీనజీర్, తెలుగు మీడియంలో ప్రథమస్థానంలో ప్రదీప్ (కడ్తాల్), ద్వితీయస్థానంలో అవెజ్ (పాక్‌పట్ల), తృతీయస్థానంలో నేహ ఫిర్దోస్ (సోన్) నిలిచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆరాధన, గణిత ఉపాధ్యాయులు రవికాంత్, రమాదేవి, బాబు, గణేశ్, చంద్రశేఖర్‌రావు, కవిత, సౌజన్య, ఆసిఫ్ పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలో శుక్రవారం మండలస్థాయి గణిత పోటీలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల పాఠశాలలకు చెందిన 27 మంది పోటీల్లో పాల్గొనగా ఆరుగురు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇంగ్లిష్‌మీడియంలో ఖానాపూర్ జెడ్పీఎస్ఎస్‌కు చెందిన స్వాతి, వశిష్ట (మస్కాపూర్ జెడ్పీఎస్ఎస్), రమ్య (ఎంజేపీ బాలికల పాఠశాల) ఎంపికయ్యారు. తెలుగు మీడియంలో సాయికీర్తన (జెడ్పీఎస్ఎస్ ఖానాపూర్ బాలికల పాఠశాల), దిలీప్ (తిమ్మాపూర్ జెడ్పీఎస్ఎస్), వైష్ణవి (మస్కాపూర్, కేజీబీవీ) ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయులు జాడి శ్రీనివాస్, మమత, జ్యోతి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత ప్రతిభా పోటీలు నిర్వహించగా మండలంలోని ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇంగ్లిష్ మీడియంలో ప్రథమస్థానంలో బలిరాం, ద్వితీయస్థానంలో శవధృతిక, తృతీయస్థానంలో కృష్ణవేణి, తెలుగు మీడియంలో ప్రథమస్థానంలో రాణి, ద్వితీయస్థానంలో శోభ, తృతీయస్థానంలో మనీష నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం వీరికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గంగాధర్, గణిత బోధకులు శ్రీనివాసచారి, సంధ్యారాణి, గంగయ్య, ధర్మాజీ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి దేవేంద్రబాబు

భైంసాటౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని భైంసా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి.దేవేంద్రబాబు సూచించారు. పట్టణంలోని కోర్టు కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు, విచారణ, తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో పట్టణ, రూరల్, ముధోల్ సీఐలు శ్రీను, నైలు నాయక్, వినోద్‌కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ


ఆక్షోనిమాడలో పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

పెంబి: శ్రీ సత్యసాయి 98వ జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్మల్ సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని పెంబితండా, ఆక్షోనిమాడ, యాపలగూడ గ్రామాల్లో గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గతంలో మానవ సేవే మాధవ సేవ వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన మందపల్లి, పెంబి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థుల చొప్పున ఆరుగురికి ట్రస్ట్ తరుపున బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు భీంసింగ్, పాల గంగాధర్, మండల ప్రత్యేకాధికారి అంబాజీ, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు సర్పంచ్‌లు తదితరులున్నారు.

వీల్‌చైర్ అందజేత

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేట గ్రామానికి చెందిన దివ్యాంగుడు పొలాస రవికి శుక్రవారం లయన్స్‌క్లబ్ ఖానాపూర్ అన్నదాత ఆధ్వర్యంలో వీల్‌చైర్ అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు సాదుల వెంకటస్వామి, పాలెపు సుదర్శన్, జితేందర్, సన్నిత్, భీంరావు, రాంచందర్, సుధాకర్ తదితరులున్నారు.

పశువైద్య శిబిరం

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పశువైద్య శిబిరం నిర్వహించారు. 235 మేకలు, 685 గొర్రెలకు పీపీఆర్ వ్యాక్సిన్లు వేసినట్లు మండల పశువైద్యాధికారి దీప్తి తెలిపారు. 75 గేదెలు, 42 ఆవులకు ఎఫ్ఎండీ వ్యాక్సిన్లు వేసి అల్బెండిజం, డివార్మింగ్ మాత్రలు అందజేశామన్నారు. జేఈవో రమేశ్, ఆఫీసు సబార్డినేట్ నారాయణ, నర్సయ్య, చిన్నయ్య తదితరులున్నారు.

ఘనంగా పడిపూజ

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో అఖిల్ అనే భక్తుడి నివాసంలో శుక్రవారం ఘనంగా అయ్యప్ప మహా పడిపూజను నిర్వహించారు. 18 పడిమెట్లకు దీపాలు వెలిగించారు. గణపతి, సుబ్రహ్మణ్యం, కుమారస్వామి, అయ్యప్ప చిత్రపటాలను అలంకరించి పంచామృతాలతో అభిషేకం చేశారు. గురుస్వాములు నటరాజ్, రాజేందర్, మురళి పాల్గొన్నారు.

నేడు మహాపడిపూజ

ముధోల్: మండల కేంద్రంలోని పశుపతినాథ్ శివాలయ ప్రాంగణంలో శనివారం మహా పడి పూజ నిర్వహించనున్నట్లు ముధోల్ అయ్యప్ప సేవా సమితి గురుస్వాములు ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ అయ్యప్ప సేవా సమితి వ్యవస్థాపకులు రాజు గురుస్వామి హాజరవుతారని పేర్కొన్నారు.

ఆదుకోవాలని ఆటోవాలాల ర్యాలీ


ర్యాలీ తీస్తున్న ఆటోడ్రైవర్లు

నిర్మల్‌టౌన్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఉపాధి కోల్పోతున్నామని.. సీఎం రేవంత్‌రెడ్డి తమను ఆదుకోవాలని ఆటోడ్రైవర్లు వేడుకున్నారు. శుక్రవారం ఆటోడ్రైవర్లు నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీస్టేడియం నుంచి శివాజీచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోడ్రైవర్లకు ఉపాధి లేక తమ జీవితాలు అంధకారంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సమయపాలన పాటించాలి

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సీడీపీవో సరిత అన్నారు. శుక్రవారం మండలంలోని దిలావర్‌పూర్, గోసంపల్లె, గోడలపంపు, కొత్తపేట్ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. లబ్ధిదారులకు పోషకాహారం అందించాలన్నారు. అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

ప్రజావాణిలో కళాకారుల వినతి


ప్రజాభవన్‌లో జిల్లా కళాకారులు

ఖానాపూర్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగ కళాకారులను ఆదుకోవాలని కోరుతూ తెలంగాణ సాంస్కృతిక కళా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కళాకారులు శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నిర్మల్ జిల్లాకు చెందిన పాట రాజశ్రీ, జెల్ల రాజ్‌కుమార్, కోల వెంకటేశ్, కొత్తపేట్ సాయిరాజ్, కొత్తపేట్ శంకర్, సవిత, జగన్ తదితరులు ఉన్నారు.

'ఆదివాసీ హక్కులను కాలరాయొద్దు'

ఖానాపూర్: ఆదివాసీల హక్కులను కాలరాసేలా ఆధిపత్య వర్గాలు వ్యవహరిస్తే సహించేది లేదని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు కడపత్రి తిలక్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. పంచాయతీరాజ్ చట్టం–2018 ప్రకారం జనాభా ప్రాతిపదికన కుమురంభీం ఆసిఫాబాద్ జెడ్పీ చైర్మన్ పదవి ఎస్టీ మహిళకు రిజర్వ్ చేయగా కోవ లక్ష్మిని ఎంపిక చేశారన్నారు. కానీ ఆమె ఇటీవల ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో ఖాళీ అయిన జెడ్పీ స్థానంలో జనరల్ కేటగిరీకి చెందిన కోనేరు కృష్ణారావును తాత్కాలికంగా ఎంపిక చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఇప్పటికైనా మరో ఎస్టీ మహిళను జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆదివాసీల పక్షాన పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు


మాట్లాడుతున్న ప్రసాద్‌పాల్

ఖానాపూర్: లోకరక్షకుడు క్రీస్తు పుట్టినరోజునే క్రిస్మస్ వేడుకగా జరుపుకొంటారని క్రైస్తవ ఉపాసకులు ప్రసాద్‌పాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని ఎల్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాలులో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల క్రైస్తవులతో జరిగిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఖానాపూర్ డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ కె.ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యక్షుడు సామిల్, ప్రధాన కార్యదర్శి రాజబాబు, కోశాధికారి ఏసుదాస్, కార్యవర్గ సభ్యులు నర్సింగ్‌రావు తదితరులున్నారు.

మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్ శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయ, గణేశ్ మండలి యూత్ సమన్వయంతో పూజాది కార్యక్రమాలు చేపట్టారు. గణపతిపూజ, పుణ్యహావచనం, అమ్మవారికి పంచామృతాభిషేకం, అలంకారం, బ్రహ్మాది మండల ఆరాధన, చండీహోమం, బలిప్రధానం, పూర్ణహుతి, కుంకుమ పూజలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ హాజరై పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గంగాధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలక రమణ, కౌన్సిలర్ బిట్లింగ్ నవీన్, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో జీరో టికెట్





రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో ఒకటైన మహాలక్ష్మి పథకంతో ఓ అడుగు ముందుకేసింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. శుక్రవారం నుంచి బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికుల ఆధార్ కార్డును పరిశీలించి ఉచిత జీరో టికెట్‌ను కండక్టర్లు అందజేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

డీపీవో తనిఖీ

కుభీర్: మండలంలోని కుప్టి గ్రామ పంచాయతీని డీపీవో శ్రీలత శుక్రవారం తనిఖీ చేశారు. పల్లెప్రకృతి వనాన్ని సందర్శించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. పారిశుధ్యంపై దృష్టిపెట్టాలని సిబ్బందికి సూచించారు. సర్పంచ్ గంగాబాయి, కార్యదర్శి నరేశ్ ఉన్నారు.